నీటిని లాగేస్తున్నారు..

- నల్లా కనెక్షన్‌లకు వ్యవసాయ, చైనా మోటర్లు
- తాగునీటి కోసం నిబంధనలను ఉల్లంఘిస్తున్న హాస్టళ్లు, వ్యాపార సముదాయాలు
- స్పెషల్ డ్రైవ్‌లో వెలుగుచూస్తున్న వాస్తవాలు

బంజారాహిల్స్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తాగునీటి నల్లాలకు విద్యుత్ మోటార్లు బిగించి అక్రమంగా నీళ్లను తోడేస్తున్న వారిపై జలమండలి కొరడా ఝుళిపిస్తోంది. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం జలమండలి అధికారులు, విజిలెన్స్ పోలీసులు, స్థానిక లా అండ్ ఆర్డర్ పోలీసుల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పర్యటించి విద్యుత్ మోటర్లతో తాగునీటిని లాగుతున్న నివాసాలపై దాడులు చేసి మోటర్లను సీజ్ చేశారు. జలమండలి డివిజన్-6 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, తట్టిఖానా, సోమాజిగూడ, ఎల్లారెడ్డిగూడ, బోరబండ, ఎస్పీఆర్‌హిల్స్, వెంగళరావునగర్, ఎస్ఆర్‌నగర్, ఫతేనగర్ వాటర్ సెక్షన్ల పరిధిలో ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుంది. గడిచిన వారం రోజుల్లో సుమారు 150 కేసులు నమోదయ్యాయంటే అతిశయోక్తి కాదు. ఇవన్నీ వ్యాపార సముదాయాలు, హాస్టళ్ల ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇక బస్తీల్లో ఇంకా ఎన్ని మోటర్ల వినియోగం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని అధికారులు వాపోతున్నారు.

మధురానగర్ లోని ఓ వీధిలో పది భవనాలు ఉన్నాయి. వాటిలో కొన్నింటికి కొన్ని రోజులుగా నీటి సరఫరా చాలా తక్కువగా వస్తుంది. జలమండలి అధికారులు తనిఖీలు చేపట్టారు. అదే వీధిలో ఉన్న ఓ ప్రైవేట్ హాస్టల్‌కు పుష్కలంగా నీరు వస్తుంది. ఏంటా అని అరగంట పాటు వెతకగా ఏకంగా వ్యవసాయ భూముల్లో వాడే మోటర్‌ను తాగునీటి నల్లా కనెక్షన్‌కు అమర్చి నీరు లాగుతున్నట్టు తేలింది. యజమానిని విచారించగా హాస్టల్‌లో బోరు లేకపోవడంతో తాగునీటి మీదే ఆధారపడినట్టు తేలింది.

బహుళ అంతస్థుల భవనం, సుమారు 22 కుటుంబాలు నివాసముంటున్నాయి. బోరు ఎండిపోయింది. నీటి అవసరాల కోసం ట్యాంకర్ తెప్పించుకోరు. సరఫరా చేసే నీరు తాగడానికి, వంట చేసేందుకు తప్పితే మిగతా పనులకు సరిపోవు. అసలు వీరి నీటి అవసరాలు ఎలా తీరుతున్నాయని అధికారులు తనిఖీలు చేపట్టగా చైనా మోటారు పెట్టి నీరు లాగుతున్నట్టు తేలింది. నీటి సరఫరా అవగానే సెన్సార్ ద్వారా మోటరు ఆన్ అయి నీటిని మిగతా ఇళ్లకు సరఫరా అవకముందే లాగేస్తుందని తేలింది.

హాస్టళ్లపైనే ప్రధాన దృష్టి..

సంజీవరెడ్డినగర్ జలమండలి డివిజన్ పరిధిలో ప్రైవేట్ హాస్టళ్లు అధికంగా ఉన్నాయి. చాలా హాస్టళ్లకు బోర్లు కూడా లేవు. ఇలాంటి హాస్టల్ నిర్వాహకులు మోటర్ల ద్వారా నల్లా నీటిని తోడేస్తున్నారు. యజమానులు భారీ మోటర్లు ఏర్పాటు చేసుకుని పెద్ద ఎత్తున తాగునీటిని లాగడం వల్ల వాటికి అనుబంధంగా ఉన్న కాలనీలు, బస్తీల్లోని నల్లాల్లో నీళ్లు రాక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదులు అందాయి. దీంతో హాస్టళ్లతో పాటు వ్యాపార సముదాయాలు, గెస్ట్‌హౌజ్‌లు, హోటళ్లు, భారీ వ్యక్తిగత అంతస్తులపై దృష్టిపెట్టారు. మోటర్ ఫ్రీ ట్యాప్ వాటర్ లక్ష్యంగా ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. నల్లాలకు మోటార్లు బిగించి నీటిని తోడేస్తున్నట్లు గుర్తించిన అధికారులు మొత్తంగా కనెక్షన్ కట్ చేసి రూ.5వేల జరిమానా విధించారు.

మోటర్ ఫ్రీ ట్యాప్ వాటర్ పేరుతో కార్యాచరణ..

నీటి సరఫరాలో లో ప్రెషర్‌కు చెక్ పెట్టడమే లక్ష్యంగా జలమండలి ఏప్రిల్ 15 నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించింది. లైన్‌మన్ దగ్గర నుంచి జీఎం వరకు అందరూ తాగునీటిని వదిలే సమయంలో ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశించింది. వేసవిలో నీటి కొరత రాకుండా జలమండలి అధికారులు చర్యలు చేపడుతున్నారు. నీరు వృథా చేసే వారిపై దృష్టి పెడుతున్నారు. నల్లాల నుంచి మోటర్ల ద్వారా నీటిని తోడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే హెచ్చరించారు. నీటి సరఫరాలో సాధారణ ప్రెషర్ ఉండేలా చర్యల కోసం మోటర్ ఫ్రీ ట్యాప్ వాటర్ పేరుతో కార్యాచరణ ప్రకటించారు. ఇందులో భాగంగానే ఈ వేసవిలో నాలుగు దశల్లో తనిఖీలు చేపట్టనున్నారు. వేసవి ముగిసేవరకు ఆకస్మిక తనిఖీలు కొనసాగ నున్నాయి. ఈ సర్వేలో సమగ్ర పరిశీలన జరపకుండా తప్పుడు నివేదిక సమర్పిస్తే సదరు అధికారికి మెమోలు జారీ చేయనున్నారు. ప్రతి రోజూ ఆన్‌లైన్ ఆధారంగా నివేదికలను పర్యవేక్షిస్తున్నారు.



తనిఖీల్లో అధికారులు స్వాధీనం చేసుకున్న మోటార్లు

మోటర్లు బిగిస్తే జరిమానా, కేసులు



తాగునీటి నల్లాలకు మోటర్లు బిగించి నీళ్లను తోడితే ఆ నివాసాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ప్రతి రోజూ తని ఖీలు ఉంటాయి. ఎక్కడెక్కడ నీళ్లు వదులుతున్నామో ఆ ప్రాంతాల్లో జలమండలి చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ జ్ఞానేందర్‌రెడ్డి కూడా తనిఖీలు నిర్వహిస్తారు. విజిలెన్స్ పోలీసులు ఈ తనిఖీల్లో పాల్గొంటారు. లా అండ్ ఆర్డర్ పోలీసులు కూడా ఈ బృందాల్లో ఉంటారు. అప్పటికప్పుడే మోటర్లను సీజ్ చేస్తారు. జరిమానాలు విధిస్తారు. కనెక్షన్ కట్ చేస్తారు. అందరూ జాగ్రత్తగా ఉండాలి. ఇది ఇంకా కొన్నాళ్లు కొనసాగుతోంది.

హరిశంకర్, సంజీవరెడ్డినగర్ డివిజన్ జీఎం



ప్రదర్శనలో సందర్శకులు

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో

బంజారాహిల్స్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. మరోవైపు శుభకార్యాలు, వివాహాలు ఉండడంతో కాస్త చల్లదనంతో పాటు ఫ్యాషనబుల్‌గా ఉండే ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ఎక్కువ మంది మొగ్గు చూపిస్తుంటారు. ఈ నేపథ్యంలో బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 కళింగ కల్చరల్ సెంటర్‌లో ఏర్పాటైన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో పేరిట వస్త్ర ప్రదర్శన ఆకట్టుకుంటుంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రదర్శన ప్రవేశం ఉచితం అని నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శన ఏప్రిల్ 27 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.



అన్నదానంలో పాల్గొన్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

భగవాన్ సత్యసాయి ఆరాధనోత్సవం

ఖైరతాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సత్య సాయిబాబా వారి 14వ ఆరాధనా మహోత్సవం ఖైరతాబాద్ భారీ గణపతి ప్రాంగణంలో గురువారం జరిగింది. శ్రీ సత్యసాయి సంస్థాన్ ఆధ్వర్యంలో భగవాన్‌కు పూజలు చేసి ఆయనను స్తుతిస్తూ ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మహా అన్నదానం చేశారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ విజయారెడ్డి, బీఆర్ఎస్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి, టీఎన్‌జీవో కార్యదర్శి చంద్రశేఖర్, కాంగ్రెస్ నేత మహేందర్‌బాబు తదితరులు సత్యసాయి చిత్రపటానికి నివాళులర్పించారు.

మంచం పైనుంచి కిందపడి కార్పెంటర్ మృతి

అమీర్‌పేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మంచం పై నుంచి కిందపడిన వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సౌభాగ్యనగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్‌కు చెందిన చంద్రశేఖర్(50) జీవనోపాధి కోసం పది సంవత్సరాల కిందట భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి నగరానికి వచ్చాడు. కార్పెంటర్‌గా పనిచేస్తూ బల్కంపేట సమీపంలోని సౌభాగ్యనగర్‌లో నివాసం ఉంటున్నాడు. కుటుంబ కలహాలతో ఐదు సంవత్సరాల క్రితం భార్య పిల్లలను తీసుకుని సొంత గ్రామానికి వెళ్లిపోయింది. గురువారం గది నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు పగలగొట్టి లోనికి వెళ్లి చూడగా మంచం కింద బీరువా పక్కన పడి మృతి చెంది ఉన్నాడు. నిద్రలో కింద పడినప్పుడు తలకు బీరువా తగిలి మృతిచెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూర్ఛవ్యాధితో దినసరి కార్మికుడు..

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): దినసరి కార్మికుడు మూర్ఛ వ్యాధితో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొరసవాడ గ్రామం, పాతపట్నం మండలం, శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఈగల ఆదినారాయణ(42) జవహర్‌నగర్‌లో నివాసం ఉంటూ అడ్డా కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల 22న పనికి వెళ్లాడు. పనిలో ఉన్నప్పుడే మూర్ఛ రావడంతో అక్కడున్న వారు భార్య హేమలతకు ఫోన్ ద్వారా సమాచారం అందించి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

ఎక్స్‌ట్రా గ్లాస్ అడిగినందుకు బార్ సిబ్బంది దాడి

బంజారాహిల్స్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎక్స్‌ట్రా గ్లాస్ అడిగినందుకు యువకుడిపై బార్ సిబ్బంది మూకుమ్మడి దాడి చేశారు. ఏపీ బొబ్బిలికి చెందిన సాయి, హరీష్, లక్ష్మణ్, జగదీష్ ఈనెల 23న ఇందిరానగర్‌లోని అమృత్‌బార్‌కు వచ్చారు. అక్కడ అందరూ కలిసి మద్యం తాగారు. అనంతరం హరీష్, లక్ష్మణ్, జగదీష్ వెళ్లిపోయారు. సాయి అక్కడే కూర్చొని మద్యం తాగుతున్నాడు. కొద్దిసేపటికి బార్ కౌంటర్‌కు వెళ్లి ఎక్స్‌ట్రా గ్లాస్ కావాలని కోరాడు. వినిపించుకోని సిబ్బంది వాగ్వాదానికి దిగారు. అనంతరం సాయిపై పిడిగుద్దులు గుద్దారు. సోఫా మీద పడేసి కొట్టారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

బంజారాహిల్స్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నగరంలో మద్యం దుకాణాలు మూసివేశారు. యూసుఫ్‌గూడలో టీ దుకాణం నిర్వహించే రంగు ఉత్తర అనే మహిళ ముందుగానే వైన్‌షాప్ నుంచి ఆఫీసర్ చాయిస్, ఓల్డ్ ఎడ్వైరల్ మద్యం కొనుగోలు చేసి ఈనెల 23న అధిక ధరకు అమ్ముతుండగా పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు ఆమెను అరెస్ట్ చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేగంగా వచ్చి ఢీకొట్టాడు..

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సిగ్నల్ జంప్ చేసి, రాంగ్‌రూట్‌లో వేగంగా వచ్చిన ఓ యువకుడు వైద్యుడి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి వెళ్లిపోయాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏఐజీ ఆస్పత్రి వైద్యుడు కన్నెగంటి వెంకటేశ్వరప్రసాద్ మైత్రివనం నుంచి జూబ్లీహిల్స్ వెళ్లే రోడ్డులో వస్తున్నాడు. సిగ్నల్ జంప్, రాంగ్ రూట్‌లో వచ్చిన ఓ గుర్తు తెలియని యువకుడు ఢీకొట్టి వేగంగా వెళ్లిపోయాడు. కిందపడ్డ ప్రసాద్‌కు గాయాలు కావడంతో ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

180 గజాల్లో ఆరంతస్థుల భవనం నిర్మాణం

అనుమతి లేని మూడంతస్థులు కూల్చివేత

బంజారాహిల్స్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కొద్దిపాటి స్థలంలో మూడు అంతస్థులకు అనుమతి తీసుకొని ఆరు అంతస్థుల నిర్మాణం చేపట్టిన భవనంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు.11లోని 180 గజాల స్థలంలో దీపక్‌కుమార్ గుప్తా సిల్ట్ ప్లస్ రెండు అంతస్థుల భవన నిర్మాణానికి అనుమతులు తీసుకున్నాడు. అక్రమంగా మరో మూడంతస్థుల నిర్మాణం చేపట్టారు. మొత్తం ఆరు అంతస్థులు నిర్మించాడు. దీనిపై స్థానికులు పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. చివరకు టౌన్‌ప్లానింగ్ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేశారు. అనంతరం గురువారం సిబ్బందితో అక్రమంగా నిర్మించిన మూడు అంతస్థుల్లో కూల్చివేతలు నిర్వహించారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా బంజారాహిల్స్ పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు.

అధికారులు, నాయకులకు భారీగానే డబ్బులు

రోడ్డు నెంబర్.11లోని నిర్మాణదారుడు గతేడాది మొదట్లో నిర్మాణం మొదలు పెట్టారు. ఎనిమిది నెలల క్రితం అక్రమంగా మూడు అంతస్థులు వేశాడు. ఇలాంటి నిర్మాణాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎప్పటికప్పుడు కన్నేసి ఉంచాలి. అక్రమ నిర్మాణం జరుగుతుందని తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికులు కలగజేసుకొని కోర్టును ఆశ్రయించడంతోపాటు ప్రజావాణిలో ఫిర్యాదు చేసే వరకు ఎందుకు మీనమేషాలు లెక్కించారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ నిర్మాణం మొదలు అయినప్పటి నుంచి భారీగా డబ్బులు చేతులు మారినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. టౌన్‌ప్లానింగ్ అధికారులతోపాటు స్థానికంగా ఉండే నాయకులకు భారీగానే డబ్బులు ముట్టాయి అనేది స్థానికులు వాదన. డబ్బు వేధింపులు పెరిగిపోవడంతో నిర్మాణదారుడు భరించలేక అందరితో గొడవపడడంతో పాటు తాను ఫలానా వారికి భారీగా డబ్బులు ఇచ్చాను. ఇక ఎవరూ కూల్చలేరంటూ ప్రచారం చేయడంతో పాటు ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు చివరకు కూల్చక తప్పలేదు.



భవనాన్ని కూల్చివేస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది



అక్రమంగా నిర్మించిన భవనం



ర్యాంకర్లను అభినందిస్తున్న నిర్వాహకులు

సివిల్స్‌లో రాణించిన ఆర్క్ రిఫ్లెక్షన్స్ విద్యార్థులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సివిల్స్‌లో ఆర్క్ రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ బై మధుంరామ్ సంస్థ విద్యార్థులు రాణించారు. ఇటీవల ప్రకటించిన యూపీఎస్సీ సివిల్స్ సర్వీసెస్ ఫలితాల్లో సంస్థకు చెందిన 26 మంది విద్యార్థులు తమ ప్రతిభ కనబర్చారు. బంజారాహిల్స్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో విద్యార్థులు ఆర్క్ గ్రూప్ చైర్మన్ గుమ్మి రాంరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ పాకాల మధుసూదన్‌రెడ్డి, అకాడమీ చీఫ్ మెంటార్, డైరెక్టర్ డా.గడియారం వివేకానంద అభినందించారు. అనంతరం రాంరెడ్డి మీడియాతో మాట్లాడుతూ వందలోపు 5 ర్యాంక్‌లు సాధించినట్టు తెలిపారు. 2030లో 100 మంది ఐఏఎస్, ఐపీఎస్‌లను దేశానికి అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ప్రస్తుతం సివిల్స్‌లో తమ విద్యార్థులు 15, 46, 62, 68, 99, 146, 187, 218, 232, 63, 346, 430, 455, 520, 591, 641, 667, 716, 739, 770, 798, 829, 904, 938, 944, 975వ ర్యాంక్‌లు సాధించడం గర్వంగా ఉందని పేర్కొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థిని

అమీర్‌పేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎస్ఆర్‌నగర్ నారాయణ కళాశాల వాగ్దేవి క్యాంపస్ ఎంపీసీ విద్యార్థిని సానిక రుక్సార్ సత్తాచాటారు. 470 మార్కులకు 466 మార్కులు సాధించి కళాశాలలో మొదటిస్థానంలో నిలిచారు. ఈమెను కళాశాల నిర్వాహకులు, తల్లిదండ్రులు గురువారం అభినందించారు.



సానిక రుక్సార్(466)

ఎంఈసీలో మాస్టర్‌మైండ్స్ విద్యార్థుల హవా

అమీర్‌పేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించినట్లు అమీర్‌పేట బ్రాంచి అడ్మిన్ ఇన్‌చార్జి ఎస్‌ఎం వలీ, బ్రాంచి అకాడమిక్ ప్రిన్సిపాల్ అశోక్ కుమార్ తెలిపారు. జూనియర్ ఇంటర్ ఫలితాల్లో కె.గాయత్రి వర్ధిని 495/500, బి.గౌరీష్ 495, ఎం.ఎస్.ఎన్.వి.సహిస్నూ 495 మార్కులు, సీనియర్ ఇంటర్‌లో జి.కౌశిక్‌గౌడ్ 987/1000 మార్కులు సాధించారు. మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల అత్యుత్తమ బోధనా విధానం, క్రమశిక్షణే విద్యార్థుల జయానికి కారణమని ప్రిన్సిపాల్ తెలిపారు. అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎస్‌ఎం వలీ గురువారం కళాశాలలో అభినందించారు.

కుస్తీ పోటీల్లో బంగారు పతకం

ఎర్రగడ్డ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): చిన్న వయసులోనే కుస్తీ (రెజ్లింగ్) పోటీలో రాష్ట్ర, జిల్లా, జాతీయస్థాయిలో అనేక పథకాలు సాధిస్తున్న పూజ నిత్లేకర్ ఎందరినో అబ్బురపరుస్తోంది. న్యూఢిల్లీలో డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న 68వ నేషనల్ స్కూల్ గేమ్స్ పోటీలో ఎర్రగడ్డ బి.శంకర్‌లాల్ నగర్‌కు చెందిన పూజా నిత్లేకర్ బంగారు పతకం సాధించింది. అండర్-17 బాలికల పోటీలో 46 కేజీల విభాగంలో తెలంగాణ రాష్ట్రం నుంచి పూజ నిత్లేకర్ ఒక్కరే బంగారు పతకాన్ని సాధించారు. ఈమెను కోచ్, తండ్రి చంద్రకాంత్ నిత్లేకర్ గురువారం అభినందించారు.



బంగారు పతకంతో పూజ నిత్లేకర్

పుస్తకం జ్ఞానభాండాగారం : తనికెళ్ల భరణి

ఎర్రగడ్డ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పుస్తకం అనేది జ్ఞానభాండాగారమని, అలాంటి పుస్తకాలను చదివే అలవాటు పిల్లలకు కల్పించడం ఎంతో అవసరమని ప్రముఖ సినీనటులు, రచయిత తనికెళ్ల భరణి అన్నారు. ఎర్రగడ్డలోని బ్రిగెడు సిట్‌ఆడిల్ గేటెడ్ కమ్యూనిటీలో స్థానికులు పుస్తకాలను సమకూర్చుకొని ఏర్పాటు చేసుకున్న లైబ్రరీని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు తమకు తాముగా పుస్తకాలను సమకూర్చుకొని గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. గేటెడ్ కమ్యూనిటీలో జిమ్ము, స్విమ్మింగ్ పూల్ లాంటివి ఉంటాయని, ఒక లైబ్రరీ, రీడింగ్ రూమ్ ఏర్పాటుకు ప్రయత్నించడం అభినందనీయమని ప్రముఖ స్టోరీ టెల్లర్ రావి రామ అన్నారు. ప్రముఖ కవి నాగేశ్వరరావు మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి పుస్తకాలు చదవడం వల్ల తాను కవిగా మారానని అన్నారు. కార్యక్రమంలో సుమన్ టీవీ సీఈవో జయలక్ష్మి, ప్రముఖ రచయిత అరిపిరాల సత్యప్రసాద్, యోగాచార్య ధరణిప్రగడ ప్రకాశ్‌రావు, లైబ్రరీ రూపకల్పన చేసిన కూచిపూడి ప్రసాద్, స్వాతి వాసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్థానికులు పుస్తకాలతో ఏర్పాటు చేసుకున్న లైబ్రరీని ప్రారంభించిన ప్రముఖ సినీనటులు తనికెళ్ల భరణి రచయితలు



తమలపాకులతో అలంకృతురాలైన బల్కంపేట ఎల్లమ్మ

బల్కంపేట ఎల్లమ్మకు తమలపాకులతో అలంకారం

అమీర్‌పేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల ఆరాధ్య దైవం బల్కంపేట ఎల్లమ్మను గురువారం తమలపాకులతో అత్యంత సుందరంగా అలంకరించారు. తమ ఇంటి ఇలవేల్పుగా కొలిచే ఓ భక్తుడు తాను కోరిన కోరికలు తీరుస్తున్న అమ్మవారికి ప్రత్యేక, ఆకర్షణీయమైన అలంకారం చేయాలని కోరుకుంటూ గురువారం సుమారు 5 వేలకు పైగా తమలపాకులను అందజేశారు. వీటితో అలంకృతురాలైన ఎల్లమ్మ పచ్చటివర్ణ శోభతో భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.



ఎర్రమంజిల్‌లో యూత్ ఫర్ యాంటీ కరప్షన్(వైఏసీ) ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న సంస్థ ప్రతినిధులు రాజేంద్ర, కొన్నె దేవేందర్, డా.ప్రవంతి, గీతానంద్, స్వప్న, రమేశ్‌బాబు, వరికుప్పల గంగాధర్, బత్తిని రాజేశ్, నాగేంద్ర, వంశీకృష్ణ, నరేష్



బీకేగూడలో కొవొత్తులతో ర్యాలీ నిర్వహించి పహల్గాం మృతులకు నివాళులర్పిస్తున్న బీజేపీ సనత్‌నగర్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఆకుల మహేష్ కుమార్ తదితరులు

ఏటీఎం మిషన్‌లో చొరబడిన ఘరానా మోసగాళ్లు

- కస్టమర్లు డ్రా చేసే డబ్బులు బయటకు రాకుండా ప్లాస్టర్ల అంటివేత
- నకిలీ తాళంతో యాక్సెస్ మిషన్ తెరచి డబ్బులు చోరీ
- ఎస్ఆర్‌నగర్‌లో వెలుగులోకి..

అమీర్‌పేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం మిషన్‌లో సరికొత్త మోసం వెలుగు చూసింది. కస్టమర్లు డ్రా చేసే డబ్బులు బయటకు రాకుండా ప్యానెల్ యాక్సెస్‌లో ఇరుక్కునేలా ప్లాస్టర్ అంటించి.. కస్టమర్లు బయటకు పోగానే నకిలీ తాళంతో యాక్సెస్ మిషన్ తెరచి అందులోని డబ్బులను చోరీ చేసిన దొంగ ఉడాయించాడు. కస్టమర్లు ఏటీఎం నుంచి లావాదేవీలు జరిగినట్లు మెసేజ్‌లు వచ్చినప్పటికీ.. ఖాతాదారులకు ఏటీఎం నుంచి డబ్బు రాలేదు. ఈనెల 16న ఓ కస్టమర్ తనకు జరిగిన మోసంపై అంబుడ్స్‌మెన్‌కు ఫిర్యాదు చేయడంతో బ్యాంక్ అధికారుల దృష్టికి వచ్చింది. యూనియన్ బ్యాంక్ డిప్యూటీ బ్రాంచి హెడ్ బి.ప్రదీప్ దినకర్ రాజు ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏటీఎం సీసీ ఫుటేజీని పోలీసులు పరిశీలించగా.. నగదు పంపిణీ స్లాట్‌లో టేప్ అంటించి డబ్బు బయటకు రాకుండా అడ్డుకున్నట్లు వెల్లడైంది. మారుతాళంతో ఏటీఎం ప్యానెల్ యాక్సెస్‌ను తెరిచి అక్కడ చిక్కుకుని ఇరుక్కుపోయిన డబ్బు కాజేసి మోసం చేసినట్లు తేలింది. ముందస్తు పథకంతో పదేపదే ఏటీఎంలోకి చొరబడి సుమారు రూ.45 వేలు దోచుకెళ్లినట్లు వెల్లడైంది. ఏటీఎం ప్రాసెస్ మిషన్‌లో టేపు అంటించి చోరీ, మోసాలకు పాల్పడ్డ దొంగల ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'పాస్టర్స్ అండ్ మైనార్టీస్ అట్రాసిటీ ప్రివెంటివ్ యాక్ట్‌ను ఏర్పాటు చేయాలి'

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పాస్టర్స్ అండ్ మైనార్టీస్ అట్రాసిటీ ప్రివెంటివ్ యాక్ట్‌ను ఏర్పాటు చేయాలని క్రైస్తవ సంఘాల ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతి నేపథ్యంలో యావత్తు క్రైస్తవ సమాజం, పాస్టర్లు, సువార్తికుల రక్షణకు ఒక ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను క్రైస్తవ సంక్షేమ సంఘం, భారత క్రిస్టియన్ కౌన్సిల్, ఆల్ ఇండియా క్రిస్టియన్ రైట్స్ ఫోరం డిమాండ్ చేశాయి. ప్రవీణ్ పాస్టర్ అట్రాసిటీ ప్రివెంటివ్ యాక్ట్ సాధన సమితిగా ఏర్పడి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పోలీస్, కోర్టులు, రాజకీయ పార్టీలకు వినతి పత్రాలు సమర్పిస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్, నిర్భయ, మెడికల్ స్టాఫ్‌లకు ఉన్నట్లు మైనారిటీ అట్రాసిటీ ప్రివెంటివ్ యాక్ట్‌ను సాధించేందుకు అన్ని డినామినేషన్ ఇండిపెండెంట్ చర్చిల పాస్టర్లు, బిషప్‌లతో కలిసి కృషి చేస్తామని కన్వీనర్ పి.వి.యోహాను, సభ్యులు ఉదయ్ కుమార్, జె.సుధీర్, టైటస్, భాస్కర్ తెలిపారు.



బడిబాట కార్యక్రమంలో మదన్ మోహన్, శారదామల్లేష్, విద్యార్థులు

దూద్‌బావిలో బడి బాట

చిలకలగూడ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పిల్లలను బడికి పంపించడం తల్లిదండ్రుల బాధ్యతని మారేడుపల్లి మండల విద్యాధికారి మదన్‌మోహన్ పేర్కొన్నారు. మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. దూద్‌బావి, మేడిబావి, చింతబావి, కేశవనగర్, చిలకలగూడ ప్రాంతాలలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మదన్‌మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పోరేట్ స్కూల్స్‌కు దీటుగా విద్యనందించటానికి మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నాణ్యమైన విద్యాబోధనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యురాలు శారద, సీపీఐ నాయకుడు కాంపల్లి శ్రీనివాస్, యం.వి.ఫౌండేషన్ ఆర్గనైజర్ సువర్ణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా ఆరాధానోత్సవం

సికింద్రాబాద్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా 14వ ఆరాధానోత్సవం గురువారం బోయినపల్లి విద్యాగణపతి ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. సత్యసాయిబాబా చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ న్యాయమూర్తి బలరాంగౌడ్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ పాల్గొని మాట్లాడారు. సత్యసాయిబాబా సేవా సమితి చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. బోయినపల్లి సత్యసాయిబాబా సేవా సమితి కన్వీనర్ కృష్ణమోహన్, రమణారెడ్డి, ఉదయ్ నారాయణ్, రఘునందన్‌రెడ్డి, కొంపల్లి సమితి కన్వీనర్ సంజీవరెడ్డి, నరేందర్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీలతారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద పంపిణీ నిర్వహించారు.


సత్యసాయిబాబా ఆరాధానోత్సవంలో బలరాంగౌడ్, జంపన తదితరులు

రోడ్డుకు అడ్డంగా ఉన్న భారీ వృక్షం తరలింపు

అడ్డగుట్ట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి ఏఓసీ గేటు నుంచి మహేంద్రా హిల్స్ వెళ్లే మూలమలుపు వద్ద రోడ్డుకు అడ్డంగా ఉన్న భారీ వృక్షాన్ని ట్రాఫిక్ పోలీసులు ఎక్స్‌కవేటర్ సాయంతో వేళ్లతో సహా తొలగించి మరోచోట పాతిపెట్టారు. నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, తిరుమలగిరి ట్రాఫిక్ సీఐ మధుబాబు, మారేడుపల్లి ట్రాఫిక్ ఎస్సై శ్రీధర్ కలిసి కంటోన్మెంట్ అధికారుల నుంచి అనుమతులు తీసుకుని గురువారం ఉదయం రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును ఎక్స్‌కవేటర్ సాయంతో వేళ్లతో సహా బయటికి తీసి కిలోమీటర్ దూరంలో ఉన్న ఏఓసీ గేటు ఆర్మీ రేంజ్ ఏరియాలో ఉన్న ఢిల్లీ గేటు వద్ద పాతిపెట్టి, ప్రత్యేక పూజలు చేశారు.


ఆర్మీ ఢిల్లీ గేటు ప్రాంగణంలో చెట్టును పాతిపెట్టి పూజ చేసిన ట్రాఫిక్ పోలీసులు

ప్రణాళికలు ఘనం ఆచరణలో శూన్యం


ఓపెన్ జిమ్‌ల ఏర్పాటులో కంటోన్మెంట్ బోర్డు విఫలం

ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలి



సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో పెద్ద పార్కులతో పాటు చిన్న పార్కులు చాలా ఉన్నాయి. అటు కంటోన్మెంట్ బోర్డు సిబ్బంది, ఇటు కాలనీవాసుల చొరవ కారణంగా వీటి నిర్వహణ బేషుగ్గా జరుగుతోంది. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలి. పిల్లలు, యువతతో పాటు ప్రతి ఒక్కరూ ఓపెన్ జిమ్‌లను సద్వినియోగం చేసుకుంటారు. ఈ విషయమై సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీఈఓ మధుకర్‌నాయక్ దృష్టికి కూడా తీసుకువెళ్లాం.

- కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యులు బాణుక నర్మద



త్వరలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తాం

ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతనివ్వవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా అటు ఆహ్లాదానికి, ఇటు ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకోవలసిన ఆవశ్యకత ఉంది. ఆహ్లాదకర వాతావరణం, వినోదం కోసం ఉన్న పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడం వల్ల అన్ని వయస్సుల ప్రజలు వ్యాయామం చేస్తూ ఆరోగ్యవంతంగా జీవించే అవకాశం ఉంది. ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు విషయం నా వద్దకు ఇటీవలే ప్రస్తావనకు వచ్చింది. వెంటనే అధికారులను పిలిచి మాట్లాడాను. వీలైనంత త్వరగా ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని, దీనికి అవసరమైన టెండర్ ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించాను.

- కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్

సికింద్రాబాద్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రణాళికలు రూపొందించడంలో ఘనంగా వ్యవహరించే సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు.. ఆచరణలో మాత్రం శూన్యమని నిరూపించుకుంటోంది. చుట్టూ ఉన్న జీహెచ్ఎంసీలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పరిశీలించే అధికారులు.. వాటిని మించి తాము అభివృద్ధి చేస్తామని ప్రతిపాదనలు రూపొందించడం, ప్రణాళికలు సిద్ధం చేయడం, ఆ తర్వాత చేతులెత్తేయడం పరిపాటిగా మారింది. ఉన్నతాధికారులు బదిలీ అయి, వారి స్థానంలో కొత్తగా వచ్చిన ఉన్నతాధికారులకు ఆ ప్రతిపాదనలు, ప్రణాళికల గురించి వివరించి, కార్యరూపం దాల్చేలా చూడడంలో కిందిస్థాయి అధికారులు ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగం అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఓపెన్ జిమ్‌లను ఉదాహరణగా తీసుకుంటే.. నాలుగు సంవత్సరాల క్రితం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం ప్రతిపాదనలు రూపొందించింది. చుట్టూ ఉన్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారని, వాటి వల్ల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. జీహెచ్ఎంసీలో మాదిరిగా కంటోన్మెంట్‌లో కూడా ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేద్దామని, తద్వారా ప్రజల దేహదారుఢ్యాన్ని పెంచిన వారమవుతామని చర్చించారు. బోయినపల్లిలోని సంచారపురి కాలనీ పార్కు, బొల్లారంలోని కంటోన్మెంట్ పార్కు, పికెట్‌లోని కంటోన్మెంట్ పార్కు, కార్ఖాన, తిరుమలగిరి, మహేంద్రాహిల్స్ తదితర ప్రాంతాల్లో 8 ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని పాలకమండలి సమావేశంలో నిర్ణయించారు. ఈ మేరకు టెండర్లు ఆహ్వానించి, వీలైనంత త్వరగా ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. అయితే, ఆ తర్వాత కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షులు ఇద్దరు మారారు. కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి కూడా మారారు. కానీ, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు ప్రక్రియ మాత్రం ముందుకు సాగలేదు. ఓపెన్ జిమ్‌ల గురించి ప్రస్తావించిన నాథుడే కరువయ్యాడు.


తమలపాకులతో అలంకృతురాలైన బల్కంపేట ఎల్లమ్మ

బల్కంపేట ఎల్లమ్మకు తమలపాకులతో అలంకారం

అమీర్‌పేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల ఆరాధ్య దైవం బల్కంపేట ఎల్లమ్మను గురువారం తమలపాకులతో అత్యంత సుందరంగా అలంకరించారు. తమ ఇంటి ఇలవేల్పుగా కొలిచే ఓ భక్తుడు తాను కోరిన కోరికలు తీరుస్తున్న అమ్మవారికి ప్రత్యేక, ఆకర్షణీయమైన అలంకారం చేయాలని కోరుకుంటూ గురువారం సుమారు 5 వేలకు పైగా తమలపాకులను అందజేశారు. వీటితో అలంకృతురాలైన ఎల్లమ్మ పచ్చటివర్ణ శోభతో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

రజతోత్సవ సభను విజయవంతం చేయండి

● ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎల్కతుర్తిలో ఈనెల 27న తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ విజ్ఞప్తి చేశారు. గురువారం సాయంత్రం సీతాఫల్‌మండిలోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, సునీత, ప్రసన్నలక్ష్మీతో కలిసి పోస్టర్స్‌ను అతికించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి వరంగల్ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు సుందరం, కందినారాయణ, ఆలకుంట హరి, చంద్రశేఖర్, శైలేందర్, మేడిశెట్టి బాలాజీ, మురళి, పాకసాయి తదితరులు పాల్గొన్నారు.


సీతాఫల్‌మండిలో చలో వరంగల్ పోస్టర్స్‌ను అతికిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, కార్పొరేటర్లు

సీతాఫల్‌మండి, నామాలగుండులో..

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ కోరారు. గురువారం సీతాఫల్‌మండి, నామాలగుండు తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్, కార్యకర్తలతో కలిసి చలో వరంగల్ పేరుతో గోడలకు వాల్ పెయింటింగ్ వేశారు. పలు బీఆర్ఎస్ పార్టీ జెండా దిమ్మెలకు రంగులను వేశారు. సీతాఫల్‌మండి డివిజన్ నుంచి అధిక సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు సభకు తరలిరావాలని కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరాటేరాజు, నవీన్, రవి, శరణ్, మణిమంజరి, విజయలక్ష్మి, లక్ష్మి, లలిత, అనిత, అరుణ, భాగ్య, రేవతి, పింకి, సంగీత, పద్మ పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే లక్ష్యం

మారేడుపల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రతి పేద కుటుంబానికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. గురువారం పికెట్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కులను 28 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

సత్యసాయిబాబా ఆరాధానోత్సవాలు

మానవసేవే మాధవసేవ అని, అన్ని మతాలు, కులాల కన్నా మానవత్వమే గొప్ప అని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జేబీఎస్ బస్టాండ్ ప్రాంగణంలో నిర్వహించిన సత్యసాయిబాబా 14వ ఆరాధానోత్సవాల్లో ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాటర్ క్యాంపును, అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

బోయినపల్లి బాపూజీనగర్‌లో అగ్నిప్రమాదం

బోయినపల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): బోయినపల్లి బాపూజీనగర్‌లోని భవన నిర్మాణానికి సంబంధించిన కట్టెల దుకాణంలో గురువారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. నల్లపోచమ్మ దేవాలయాన్ని ఆనుకుని వెనుకాల ఉన్న కట్టెల దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా... కంటోన్మెంట్, సికింద్రాబాద్ ప్యారడైజ్ ప్రాంతాలకు చెందిన రెండు ఫైరింజన్‌లు ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశాయి. ఈ అగ్నిప్రమాద ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని అగ్నిమాపక అధికారి రాఘవరెడ్డి తెలిపారు. అయితే, కట్టెల దుకాణంలో వెలిగించిన దీపం మూలంగానే అక్కడున్న కట్టెలకు మంటలు అంటుకున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ అగ్నిప్రమాదం వల్ల దాదాపు రూ.3 లక్షల వరకు నష్టం జరిగిందని కట్టెల దుకాణం యజమాని మోహన్ తెలిపారు.


అగ్ని ప్రమాదం సంభవించిన కట్టెల దుకాణం

అంబేడ్కర్ విగ్రహం ప్రహరీని ఢీకొన్న లారీ

తిరుమలగిరి ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): లోత్‌కుంటలోని అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ఉన్న ప్రహరీని లారీ గురువారం తెల్లవారు జామున ఢీ కొట్టింది. దీంతో ప్రహరీ పూర్తిగా ధ్వంసమైంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ గోల్నాక నుంచి లారీ గ్రానైట్ లోడ్‌తో సికింద్రాబాద్ వైపు వెళ్తుంది. మద్యంమత్తులో ఉన్న డ్రైవర్ లారీతో లోత్‌కుంట వద్దకు రాగానే అదుపు తప్పి అంబేడ్కర్ విగ్రహం ప్రహరీని ఢీ కొట్టాడు. దీంతో ప్రహరీ పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ట్రాఫిక్ జామై రాజీవ్ రహదారిపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు బృందం ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

రోడ్డుపై జారిపడి వ్యక్తి మృతి

తిరుమలగిరి ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడడంతో తలకు తీవ్రగాయాలై మృతిచెందాడు. ఈ ఘటన బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై దుర్గారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శివకుమార్ యాదవ(48) భార్యతో కలిసి మారేడుపల్లిలో అద్దెకు ఉంటున్నారు. బుధవారం మచ్చబొల్లారం వెళ్లి ఫుల్లుగా మద్యం తాగి బొల్లారం తెలంగాణ తల్లివిగ్రహం నుంచి నడుచుకుంటూ వస్తున్నాడు. ప్రమాదవశాత్తు కాలుజారి రోడ్డుపై పడడంతో తలకు తీవ్రమైన గాయాలు అయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా వారు వచ్చి బాధితుడిని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడని 108 సిబ్బంది నిర్ధారించారు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని గురువారం బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.


మెట్టుగూడలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



ఎంజీ రోడ్డులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు


కొవ్వొత్తులు వెలిగించి అమరులకు నివాళులర్పిస్తున్న బోయినపల్లి వాసులు

డివైడర్‌పై వ్యక్తి మృతదేహం


మహదేవ్ మృతదేహం

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు మధ్యలో డివైడర్‌పై ఉన్న వ్యక్తి మృతదేహాన్ని మార్కెట్ పోలీసులు స్వాధీనం చేసుకుని మార్చురికి తరలించారు. బుధవారం మోండా మార్కెట్ రోడ్డులోని సైనిక్ భవన్ సమీపంలో ఓ వ్యక్తి అచేతనంగా పడి ఉండటంతో బార్బర్ షాపుకు చెందిన సురేష్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అంబులెన్స్ సిబ్బంది ఆ వ్యక్తిని పరిశీలించి మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. అనారోగ్య కారణాలతో మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి పేరు మహదేవ్ అని, అతడు ఒంటరిగా రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో భిక్షటన చేస్తూ చెత్త కాగితాలు ఏరుకుంటూ జీవించే వాడని తెలిపారు. మృతుడికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే మార్కెట్ ఎస్సై మమతను సంప్రదించాలని పేర్కొన్నారు.

గాంధీ ఆస్పత్రిలో మహిళ అదృశ్యం


మణెమ్మ

బౌద్ధనగర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో రోగి సహాయకురాలిగా వచ్చిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ బండమేడిపల్లికి చెందిన ఎం.మణెమ్మ(36) థైరాయిడ్, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న తన తల్లిని ఈనెల 20న గాంధీ ఆస్పత్రిలో చేర్పించి సహాయకురాలిగా ఉంటుంది. 23వ తేదీన రాత్రి 8గంటలకు మణెమ్మ మందులు తేవడానికి ఆస్పత్రి 3వ అంతస్తు నుంచి కిందికి వచ్చింది. కానీ, తిరిగి పైకి వెళ్లలేదు. మణెమ్మ కోసం పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవటంతో తమ్ముడు కుంబా సత్యం గురువారం చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏఎస్సై సరళ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్స్‌ట్రా గ్లాస్ అడిగినందుకు బార్ సిబ్బంది దాడి

బంజారాహిల్స్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎక్స్‌ట్రా గ్లాస్ అడిగినందుకు యువకుడిపై బార్ సిబ్బంది మూకుమ్మడి దాడి చేశారు. ఏపీ బొబ్బిలికి చెందిన సాయి, హరీష్, లక్ష్మణ్, జగదీష్ ఈనెల 23న ఇందిరానగర్‌లోని అమృత్‌బార్‌కు వచ్చారు. అక్కడ అందరూ కలిసి మద్యం తాగారు. అనంతరం హరీష్, లక్ష్మణ్, జగదీష్ వెళ్లిపోయారు. సాయి అక్కడే కూర్చొని మద్యం తాగుతున్నాడు. కొద్దిసేపటికి బార్ కౌంటర్‌కు వెళ్లి ఎక్స్‌ట్రా గ్లాస్ కావాలని కోరాడు. వినిపించుకోని సిబ్బంది వాగ్వాదానికి దిగారు. అనంతరం సాయిపై పిడిగుద్దులు గుద్దారు. సోఫా మీద పడేసి కొట్టారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పర్యాటకులపై ఉగ్రదాడి హేయమైన చర్య

● సమాజ్ వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.సింహాద్రి

తార్నాక, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్ము కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని సమాజ్ వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.సింహాద్రి అన్నారు. గురువారం తార్నాకలోని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడి దురదృష్టకరమని ఈ దాడిని సమాజ్‌వాది పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. దేశ ఐక్యతను దెబ్బతీసే ఇటువంటి ఉగ్రవాదుల చర్యలు భవిష్యత్తులో పునరావృత్తం కాకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్ఠ భద్రత చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

బాపూజీనగర్‌లో నిరసన ర్యాలీ

బోయినపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్ము కశ్మీర్ పహల్గాంలో పర్యటకులపై ఉగ్రదాడికి నిరసనగా బోయినపల్లి, బాపూజీనగర్, మహాత్మానగర్, దుబాయ్ గేట్, విష్ణోవి మాత దేవాలయం ప్రాంతాల్లో స్థానికులు భారీ ర్యాలీ నిర్వహించారు. మృతులకు ఆత్మలకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శంకర్, రాయల్ కుమార్, రాకేష్, ప్రేమ్‌కుమార్ ముదిరాజ్, ఓం యాదవ్, అనిత, సునీత, తులసీ, ఆనంద్‌గౌడ్, అశోక్, అరవింద్, ఎంఆర్‌పీఎస్ నాయకులు, హిందూ సంఘాలు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, వివిధ ఆలయాల పూజారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సీతాఫల్‌మండిలో కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహిస్తున్న కార్పొరేటర్ హేమ తదితరులు

మెట్టుగూడలో కొవ్వొత్తుల ర్యాలీ

చిలకలగూడ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో హిందూవులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి స్కైలాట్ హోటల్ వరకు నినాదాలు చేస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యురాలు శారదా మల్లేష్, నాయకులు ఆదర్శ్‌కుమార్, నాగేశ్వరరెడ్డి, నాగలక్ష్మి, నవనీత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఎంజీ రోడ్డులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

రాంగోపాల్‌పేట్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదుల నరమేధాన్ని ఖండిస్తూ ఎంజీ రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్‌కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో టీమ్ కోట నీలిమ సభ్యులు కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు కటారి మహేష్‌కుమార్, కార్యదర్శి హేమంత్ సింగ్ ఠాకూర్, రాంగోపాల్‌పేట్ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శీలం జయ, పంచముఖీ హనుమాన్ దేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బచ్చు రాజ్‌కుమార్, నాయకులు ఎస్ఆర్ శివకుమార్, నాగరాజ్, మాణిక్యం ప్రభు, రఘుయాదవ్, వెంకట్, పాండు గౌడ్, నారాయణ ముదిరాజ్, యాజిన్ ఖురేషీ తదితరులు పాల్గొన్నారు.


గాంధీ ఆస్పత్రి ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

సీతాఫల్‌మండిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

బౌద్ధనగర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యటకులపై ఉగ్రవాదుల దాడికి నిరసనగా గురువారం రాత్రి సీతాఫల్‌మండిలో బీఆర్ఎస్ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ సామల హేమ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, స్థానికులు పాల్గొని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడిలో అమరులైన వారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకు రామచందర్, కృష్ణసాయి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆస్పత్రి ఆవరణలో..

అడ్డగుట్ట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకలించాలని గాంధీ ఆస్పత్రి ఉద్యోగుల సంఘం గాంధీ యూనిట్ అధ్యక్షుడు జి.ప్రభాకర్ సూచించారు. జమ్ము కశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాల కోరుతూ గురువారం గాంధీ ఆస్పత్రి ఉద్యోగులు ఆస్పత్రి ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో యూనిట్ నాయకులు జనార్దన్, శ్రవణ్, సత్యనారాయణ, గోపాల్, ఖలీం, మక్సూద్, భావన, శ్రీనివాస్, విశ్వనాథ్, నాగబ్రహ్మం, చంద్రశేఖర్, సరళ, విజయలక్ష్మి, సురేష్, ఆకాశ్, సత్యనారాయణరెడ్డి, యూసుఫ్, వెంకటరమణ, శివరాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.